క్లుప్తంగా

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ఆగిరిపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 11న ఆగిరిపల్లి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను కలెక్టర్ కె.వెట్రిసెల్వి శనివారం పరిశీలించారు. వడ్లమాను రోడ్డులో ముఖ్యమంత్రి బహిరంగ సభ ప్రాంగణాన్ని, హెలీ ప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీరు వంటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను శరవేగంగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ ఆనంద్ బాబు, నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శుభశేఖర్ పాల్గొన్నారు.

7న వైకుంఠధామం ప్రారంభం

కాచవరం(ఇబ్రహీంపట్నం): ప్రముఖ వ్యాపారవేత్త, కాచవరం గ్రామానికి చెందిన బోడేపూడి అప్పారావు, కాశీరత్నం దంపతులు నిర్మించిన వైకుంఠధామం ఈనెల 7న ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ సందర్భంగా శనివారం అప్పారావు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో పితృ కార్యాలు, అంతిమ సంస్కారాలు ఉత్తమంగా జరగాలనే సంకల్పంతో గ్రామంలోని శ్మశానవాటికలో రూ.35 లక్షలు వెచ్చించి వైకుంఠధామం నిర్మించామని వివరించారు. 7న వైకుంఠధామం ప్రారంభం అనంతరం అన్నదానం చేస్తామని చెప్పారు.

రేపు కొండపల్లిలో మెగా వైద్య శిబిరం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో ఈనెల 7న మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని కన్సల్టెంట్ సర్జన్ డాక్టర్ మామిడి సీతారామారావు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మామిడి రత్న మోహనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్లడ్ షుగర్, సీరం క్రియాటిన్, బోన్ డెన్సిటోమెట్రీ (ఎముకల్లో సాంద్రత), కార్డియాలజిస్టు పరీక్ష, ఈసీజీ, ఎకో పరీక్షలు చేస్తారని వివరించారు.

నవమికి ఏర్పాట్లు పూర్తి

చాట్రాయి: శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. చనుబండ కోదండ రామాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగనున్న సీతారామ కల్యాణానికి వేలాదిగా భక్తులు తరలి రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎస్టీయూ నాయకుడు విజయ రామరాజుకు నివాళి

ఆగిరిపల్లి: ఎస్టీయూ నాయకుడు విజయరామరాజు వర్ధంతి కార్యక్రమం స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయ సంఘ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్టీయూ నాయకులు అంకం వెంకటేశ్వరరావు, చౌటపల్లి సురేష్ కుమార్, తాడి నరసింహారావు పాల్గొన్నారు.

రేపు తిరుపతమ్మ ఆలయంలో షాపుల వేలం

మైలవరం: బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల దేవస్థానానికి చెందిన షాపుల వేలం ఈనెల 7న ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. తేజ శనివారం తెలిపారు. పూజా ద్రవ్యాలు, ఆట వస్తువులు, బొమ్మలు, ఫ్యాన్సీ తదితర వ్యాపారం చేసుకునే లైసెన్స్ హక్కునకు, వాహనాల పార్కింగ్ ప్లేస్ లైసెన్స్ హక్కునకు ఒక సంవత్సర కాలానికి వేలం జరుగుతుందని చెప్పారు. ఇతర వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

మైలవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో మైలవరం పాత యూనియన్ బ్యాంక్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ప్రజలు కూర్చునేందుకు సిమెంట్ బెంచీలను క్లబ్ సభ్యులు శనివారం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం జెడ్‌సీ జాస్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మైలవరం పరిసర ప్రాంతాల ప్రజలు వివిధ పనులు నిమిత్తం ఇక్కడికి వస్తుంటారని, వారు కూర్చునేందుకు బల్లలను ఏర్పాటు చేశామని చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీధర్, కోశాధికారి నాగభూషణం, సభ్యులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో అనర్థాలు

- కొండపల్లి ఐడీఏలో పేరుకుపోయిన వ్యర్థాలు
- ప్లాస్టిక్ వ్యర్థాలు కామన్‌సైట్లలో నిల్వ
- కలుషితమవుతున్న తొమ్మండ్రు వాగు
- వ్యాధుల బారిన ప్రజలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో రసాయన వ్యర్థాలు కొండల్లా పేరుకుపోతున్నాయి. పరిశ్రమల ద్వారా వచ్చిన వ్యర్థాలు మురుగునీరు శుద్ధి కేంద్రానికి, ప్లాస్టిక్ డబ్బాలు, పాలిథిన్ కవర్లు ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉంది. ట్రీట్‌మెంట్ ప్లాంటుకు తరలించడం ఖర్చుతో కూడుకోవడంతో సమీప తొమ్మండ్రు వాగులో కలుపుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కామన్ సైట్లలో నిల్వ చేస్తున్నారు. యాజమాన్యాల తీరుతో మురుగునీటి శుద్ధి ప్లాంటు నిరుపయోగంగా మారింది. సమీప గ్రామ ప్రజలు కాలుష్యంతో శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ భూములు సాగుకు పనికిరాకుండా పోతున్నాయి. 1986లో 438 ఎకరాల్లో 308 ప్లాట్లతో ఏర్పడిన ఐడీఏలో 150 పరిశ్రమలు నెలకొల్పారు. వీటిలో 14 కెమికల్ కంపెనీలతో కాలుష్య ప్రభావం పెరిగింది.

కొండల్లా పేరుకుపోతున్న వ్యర్థాలు

కొండపల్లి ఐడీఏలోని కెమికల్ ఫ్యాక్టరీల ద్వారా అనేక రకాల వ్యర్థ పదార్థాలు వెలువడతాయి. నీటితో కలిసిన వ్యర్థాలను మురుగు నీటి శుద్ధి ప్లాంటుకు చేర్చకుండా రాత్రి వేళల్లో సమీపంలోని తొమ్మండ్రు వాగులోకి ట్యాంకర్ల ద్వారా వదులుతున్నారనే విమర్శ ఉంది. కెమికల్ వ్యర్థాలు వినియోగించిన తర్వాత వేస్ట్ డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లు కూడా కామన్ స్థలాల్లో నెలల తరబడి నిల్వ చేయడంతో రసాయన వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. కొందరు వ్యర్థాలు మండించడం ద్వారా వాయు కాలుష్యం ఏర్పడుతోంది. కెమికల్ వ్యర్థాలతో పరిసర గ్రామాలైన కొండపల్లి, కట్టుబడిపాలెం, శాంతినగర్, కవులూరు గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వ్యాధుల బారిన పడుతున్నారు.



కొండపల్లి ఐడీఏ సమీపంలో తొమ్మండ్రు వాగులో పేరుకుపోయిన కెమికల్ వ్యర్థాలు

సారవంతం కోల్పోతున్న పొలాలు

కొండపల్లి ఐడీఏలో నుంచి సమీపంలోని తొమ్మండ్రు వాగులోకి రహస్యంగా విడుదుల చేస్తున్న రసాయనాలతో వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారుతున్నాయి. వర్షా కాలంలో వాగు పొంగి పొలాలపై ప్రవహించడం వల్ల సమస్య మరింత జఠిలం అవుతోంది. పొలాలపై కలుషిత నీరు పారడం వల్ల పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కామన్ సైట్లలో నిల్వ చేసిన వ్యర్థాలతో పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలుగుతోంది. గ్రీనరీ పెంచాల్సిన స్థలాల్లో వ్యర్థాలు నిల్వ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కొండపల్లి ఐడీఏలోని కామన్ సైట్లలో కొండలా పేరుకుపోయిన రసాయనిక వ్యర్థాల డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లు

పట్టించుకోని ఏపీఐఐసీ, ఐలా పాలకవర్గం

1986లో ఏర్పడిన ఐడీఏ స్వయం అభివృద్ధి కోసం 1995లో నోటిఫైడ్ గ్రామ పంచాయతీగా ఏర్పడింది. తాగునీరు, రోడ్లు, వీధి లైట్లు కాలుష్య నివారణ, కెమికల్ వ్యర్థాల తరలింపు వంటి మౌలిక సదుపాయాలను ఐలా పాలకవర్గం చేపట్టాల్సి ఉంది. అయితే పాలకవర్గం కేవలం పనులు నిర్ణయించి తీర్మానం చేయడం వరకే పరిమితం అయింది. నిధుల మంజూరు, టెండర్ల ఖరారు, వాటి పర్యవేక్షణ బాధ్యత ఏపీఐఐసీ అధికారులు చేపడతారు. రెండు సంస్థల మధ్య సమన్వయ లోపంతో పనులు కాగితాలకే పరిమితం అయ్యాయి. ఐలా, ఏపీఐఐసీ అధికారుల పర్యవేక్షణ లోపంతో భూగర్భ జలాలు, వాయు కాలుష్యం పెరిగిపోతోంది.

కాలుష్య నివారణకు చర్యలు

ఐడీఏలో కాలుష్యం నివారణకు ఇప్పటికే అనేక రకాల చర్యలు చేపట్టాం. పర్యావరణ పరిరక్షణకు కామన్ సైట్లలో గ్రీనరీ పెంచుతున్నాం. రసాయన వ్యర్థాల డంపింగ్, వాటి తరలింపులో కొన్ని పొరపాట్లు ఉన్నాయి. సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లి నివారణ చర్యలు చేపడతాం.

– విజయభాస్కర్, ఐలా మేనేజర్, కొండపల్లి

ముగిసిన నిష్కళంక మాత మహోత్సవాలు

ముసునూరు: నిష్కళంక మాత మహోత్సవాలు శనివారం సాయంత్రం కృతజ్ఞతా దివ్యబలి పూజార్పణతో ఘనంగా ముగిశాయి. శుక్రవారం రాత్రి కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయవాడ ఆర్‌సీఎం మేత్రాసన బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు చేసిన అద్భుత కార్యాలకు ప్రత్యక్ష సాక్షిగా మేరీమాత నిలిచారని, ఆమెను గౌరవించి, ఆరాధించడం మనందరి బాధ్యతగా పేర్కొన్నారు. దీక్షాధారులైన విశ్వాసులకు క్రీస్తు తన సిలువ మరణంతో తెచ్చిన రక్షణ విషయాలను చెప్పారు. అనంతరం ముసునూరు, రమణక్కపేట విచారణ సిస్టర్స్, బోర్డింగ్ విద్యార్థినులు ఆలపించిన భక్తి గీతాలు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శనివారం సాయంత్రం సహాయక ఫాదర్లు ఇలవర్సన్, విలియమ్స్ నిర్వహించిన కృతజ్ఞత ఆరాధనతో నిష్కళంక మాత మహోత్సవాలు ముగిశాయి. కార్యక్రమాల్లో ఫాదర్లు, సిస్టర్లు, ఉపదేశులు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



సమిష్టి దివ్య బలిపూజ సమర్పిస్తున్న బిషప్ జోసఫ్ రాజారావు, గురువులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న జోగి రమేష్, నాయకులు



గంపలగూడెంలో నాయకుల నివాళి



ఆగిరిపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు



విస్సన్నపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

- వాడవాడలా జయంతి వేడుకలు
- చిత్రపటాలు, విగ్రహాల వద్ద నివాళి

ఇబ్రహీంపట్నం: అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ అని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం, కొండపల్లి బీకాలనీ వద్ద శనివారం జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోగి రమేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ విశేష సేవలు అందించారన్నారు. పిన్న వయస్సులో కేంద్ర కార్మిక మంత్రిగా అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు. నాలుగు దశాబ్దాల పాటు కేంద్రంలో కీలక మంత్రిత్వ శాఖల బాధ్యతలు నిర్వహించారని వివరించారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు మేడపాటి నాగిరెడ్డి, నల్లమోతు దయాకర్, ఎస్.ప్రకాష్, రెంటపల్లి నాగరాజు, శరభయ్య, పోరంకి శ్రీనివాసరావు, చెరుకు మాధవరావు, కోమటి కోటేశ్వరరావు, పచ్చిగోళ్ల పండు, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, కుంచం జయరాజు, ఎంఏ బేగ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎన్టీటీపీఎస్‌లో చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఉద్యోగులు పాల్గొన్నారు. ఆర్టీసీ డిపోలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. వివిధ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. నాయకులు కోట దానియేలు, ఎం.విజయ్ తదితరులు పాల్గొన్నారు. కొండపల్లిలో డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ నివాళులర్పించారు.

పైడూరుపాడులో..

పైడూరుపాడు(విజయవాడరూరల్): పైడూరుపాడులో వైఎస్సార్ సీపీ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు డాక్టర్ బి.రవికిశోర్ తదితరులు నివాళులర్పించారు. ఎంపీటీసీ బయ్యారపు కల్పన, మాజీ ఎంపీటీసీ వేల్పూరి వెంకటేశ్వరరావు, దళిత నాయకులు డొక్కా వెంకటరత్నం, కొమ్ముకూరు ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం అరుంధతి యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రాయనపాడు గ్రామం శాంతినగర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం జరిగింది. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మందా వెంకటేశ్వరరావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

- **మైలవరం:** మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, డీన్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- **మైలవరం:** అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయులని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మైలవరం పాత యూనియన్ బ్యాంక్ సెంటర్‌లోని జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు గర్నేపూడి వెంకట్రావు, అప్పిడి సత్యనారాయణరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, పాలా నారాయణరెడ్డి, సర్నాల తిరుపతిరావు, నాగులూరి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- **విస్సన్నపేట:** విస్సన్నపేట అంబేడ్కర్ సెంటర్లో జగ్జీవన్ రామ్ యూత్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విస్సన్నపేట సర్పంచి సాదుపాటి నాగమల్లేశ్వరి, బహుజన దళిత ఐక్య వేదిక నాయకులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కొండా రాజ్ కుమార్, గొర్రె లాజరస్, పల్లెపాము లక్ష్మయ్య, మేకల జ్ఞానరత్నం తదితరులు పాల్గొన్నారు.
- **ఆగిరిపల్లి:** స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.
- **జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిద్దాం**

చాట్రాయి: జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగించాలని కుమార్ కోచింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ అప్పికట్ల కుమార్ అన్నారు. చనుబండలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. అనంతరం కొన్నేటి ఉదయ్(బాబీ) సహకారంతో 100 మందికి చీరలు పంపిణీ చేశారు. ఎంఆర్‌పీఎస్ గ్రామ అధ్యక్షుడు కారుమంచి ఇస్రయ్య, రిటైర్డ్ పీఈటీ పిరంగి పుల్లయ్య, బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

- **గంపలగూడెంలో..**

తిరువూరు: గంపలగూడెం తోటమూల సెంటర్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి గంపలగూడెం జెడ్పీటీసీ గద్దల శామ్యూల్, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **మైలవరం:** రెడ్డిగూడెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రెడ్డిగూడెం మండల అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి కేక్ కట్ చేసి మాట్లాడారు. వివిధ విభాగాల నాయకులు చాట్ల రాబర్ట్, కె. వరప్రసాదరెడ్డి, ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, గుడిసె ప్రభాకరరెడ్డి, అలవాల శ్రీనివాసరెడ్డి, పైడిమర్ల శ్రీనివాసరెడ్డి, చాట్ల ఆదియ్య, గుంటక కులదీప్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బడుగువర్గాల ఆశాజ్యోతి..

తిరువూరు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి దివంగత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ కృషి చేశారని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లో, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన కాంస్య విగ్రహానికి స్వామిదాసు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామిదాసు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సామాజిక, ఆర్థిక ప్రగతికి జగ్జీవన్‌రామ్ వేసిన పునాదులు ఎందరికో వెలుగు నిచ్చాయని వివరించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు చలమాల సత్యనారాయణ, తాళ్లూరి నవీన్‌కుమార్, తిరువూరు నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, ఎం. దుర్గారావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. తిరువూరు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారాయణ, తిరువూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గద్దల భారతి, ఎంపీడీఓ రవిబాబు, సిబ్బంది జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.



తిరువూరులో నివాళులర్పిస్తున్న స్వామిదాసు, నాయకులు

దళితుల అభ్యున్నతికి కృషి చేసిన మహానేత

నూజివీడు: దళితుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడు బాబూ జగ్జీవన్ రామ్ అని జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు నూజివీడులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కృష్ణంరాజు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్‌లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దళితులు చదువుకోవడం ద్వారానే సమాజంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యపడుతుందని వివరించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు లాం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కంభాల రాంబాబు, జిల్లా కార్యదర్శి స్వరూపరాణి, ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు షేక్ యూనిస్‌పాషా (గబ్బర్), క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, స్థానిక కౌన్సిలర్లు, సర్పంచిలు పాల్గొన్నారు. బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి బాపునగర్ కూడలి వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ముసునూరులో..

ముసునూరు: ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు దుబ్బాకు దేవరాజ్, అధికార ప్రతినిధి కలపాల విలియమ్స్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ స్టేట్ జాయింట్ సెక్రటరీ కంబాల రాంబాబు పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. రమణక్కపేటలో వైఎస్సార్ సీపీ యువనేత ఆముదాల సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ ఉప సర్పంచ్ కృపారావు తదితరులు నివాళులర్పించారు. ముసునూరు, చెక్కపల్లి, వలసపల్లిలో పలు పార్టీల నేతలు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూరేపల్లిలో జగ్జీవన్‌రామ్‌కు సాధన ల్యాండ్ లెస్ పూర్ పీపుల్స్ సంఘ కార్యదర్శి హన్నా నివాళులర్పించారు.